# కలలు కనే కళ్ళున్నాయి

"అయామ్ ఆల్‌సో సారీ..యువర్ సన్ ఈజ్ ఎ డెడ్ బారన్ చైల్డ్" అంటూ ముందుకి కదిలాడు.

"డాక్టర్!" వెర్రివాడిలా చూశాడు.

వెళ్ళిపోతున్నాడు కిషోర్.

"ప్లీజ్ స్టాప్ దేర్, డాక్టర్" రెండంగల్లో వెళ్ళి చేరాడు.

"చెప్పండి. ఏమైంది? ఎలా జరిగింది? ఎందుకని జరిగింది?" ఆవేదనగా అడిగాడు. అతనికి పిచ్చెక్కుతున్నట్లే ఉంది.

"ఏముంది- చాలా కేసుల్లో అలా జరుగుతుంటుంది. కారణాలు ఎన్నో ఉంటాయి. మనకు కావలసింది ఫలితం..."

"మీరు సరిగా చెప్పడం లేదు. నిజం చెప్పడంలేదు. నా సుశీ ఇప్పుడెక్కడుంది?"

"వార్డు నెంబర్ త్రి. సింగిల్ బెడ్" చెప్పవలసింది మరేమీ లేనట్లు వెళ్ళిపోయాడు.

రిషి గబగబా వెళ్ళాడు.

గ్లూకోజ్ ఎక్కిస్తున్నారు సుశీలకు. స్పృహలోనే ఉంది. కానీ, నీరసంగా కళ్ళు సగం వాలిపోయి-

"సుశీ.."

కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ "వచ్చారా?" అంది. గ్లూకోజ్ ఓపిక అంతా ఒంట్లోకి వచ్చేసినట్లు.

బలవంతంగా నవ్వాడు.

"మనకి బాబట" ఆ కళ్ళలో కాంతి చూసి ఉలిక్కిపడ్డాడు.

అయితే సుశీలకి తెలియదా?

"నువ్వు బాబుని చూశావా? సుశీ?"

"లేదండీ! నాకు వీళ్ళు చూపించడం లేదు. ఇదెక్కడి ఘోరమండీ! ఇన్ని నెలలు మోసినదాన్ని..మొదట చూడవలసిన దాన్ని నాకు చూపించకుండా.."

"సార్! కొంచెం అలా వస్తారా?" నర్స్ పిలిచింది.

"ఒన్ మినిట్ సుశీ!" బయటికి వెళ్ళాడు.

"చూడండి. మీ మిసెస్ మీకు దక్కాలంటే పిల్లాడిని గురించిన నిజం చెప్పకూడదు. ఆవిడ చాలా బలహీనంగా ఉన్నారు. పిల్లాడికి నలతగా వుంటే పెద్ద డాక్టర్లు చూస్తున్నారన్న మిష పెట్టాం. మీరూ అదే అనాలి"

తల ఆడించాడు.

"నేనో మాటు బాబుని చూడాలి"

"ఫాలో మీ"

పిల్లల శవాలు వుంచే గదిలోకి వెళ్ళారు.

ఏడో నెంబరు చూసి చెక్కతొట్టి మీద గుడ్డ తీసింది.

రిషి కన్నార్పకుండా చూశాడు. తన గుండె సవ్వడి తానే వింటూ చూశాడు. బుగ్గల మీదికి జారే అశ్రుకణాలను తుడుచుకోవడం చేతకానివాడిలా చూశాడు.

అచ్చం ఆ ముక్కు మూసిన కళ్ళు, కనుబొమలు, చెవులు, చిన్న నోరు-సుశీల నోట్లోంచి ఊడిపడినట్లే ఉన్నాడు. నిద్రపోతున్న వాడిలా ఉన్నాడు. నల్లటి జుత్తు నుదిటిమీదికి తొంగిచూస్తోంది.

అప్రయత్నంగా చేతిని ముందుకు చాపాడు.

మంచు ముక్కలా తగిలింది నుదురు.

విరక్తిగా నవ్వుకున్నాడు.

'ఈ చైతన్యంలేని బొమ్మనా తాను కోరుకున్నది?'

"పిల్లాడిని తీసుకెళతారా?"

రుమాలుతో మొహం తుడుచుకున్నాడు.

"ఎస్.. ప్లీజ్"

ఏవో కాగితాలమీద సంతకాలు పెట్టించుకుంది. పొత్తిళ్ళలో పిల్లాణ్ణి తీసుకుని బయటికి వచ్చాడు. డ్రైవరు తెల్లబోయి చూస్తున్నాడు.

"మోసెస్! వీడు నా బిడ్డ. కారులో పడుకోబెట్టు. అమ్మగారికి చెప్పి వస్తాను.."

పిల్లాడిని తీసుకుని చల్లగా తగులుతున్న కాళ్ళు చూసి, "సార్!" అన్నాడు

రుద్ధకంఠంతో.

"కార్లో పడుకోబెట్టు, వస్తున్నాను" అంటూ చకచకా సుశీల ఉన్న గదిలోకి వెళ్ళాడు.

"చూశారా బాబుని?" ఆత్రంగా అడిగింది.

"చూశాను! అచ్చం నీ పోలికే. పది పౌన్లట. బరువుగానే ఉన్నాడు. నాకు అర్జెంటు పనులున్నాయి. మళ్ళీ వస్తాను..."

"మీరు వచ్చేదాకా వీళ్ళు నాకు బాబుని చూపించరేమో. మీరు కాస్త చెప్పి వెళ్ళరూ?"

"డాక్టర్ల కంటే నాకు ఎక్కువ తెలుసా? సుశీ! నీ పిచ్చిగానీ, నీ ఆత్రుత నా కన్నా వాళ్ళకే బాగా తెలుసు. వాళ్ళని వేధించకు. ఎప్పుడేది ఎలా చెయ్యాలో వాళ్ళకు తెలుసు. ప్లీజ్! టేక్ రెస్ట్.."

తిరిగి వచ్చేశాడు.

అక్కడ ఉండలేడు. సుశీలని ఓదార్చడం తనకి చేతకాదు. కార్లో కూర్చున్నాడు. బరువుగా కదిలి బయలుదేరింది.

ఏమిటీ జీవితం?

ఎవరు చెబుతారు వీటికి సమాధానాలు?

చేతుల్లో మొహం కప్పుకొని ముందు సీటు మీద వాలాడు. పక్కన చలనంలేని తన రక్తం.

ఇల్లు వచ్చిందని మోసెస్ చెప్పేవరకూ కళ్ళు తెరవలేదు.

పిల్లాడిని మోసెస్ ఇంట్లోకి ఎత్తుకువచ్చాడు.

వంటావిడ పెద్ద వయసుది. చత్వారం, చాదస్తం కూడా ఉన్నాయి. మొదట అర్థం కాలేదు.

తరవాత శోకంతో ఇల్లు అదరగొట్టేసింది.

రిషి చిరాకుపడ్డాడు.

అతనికిలాంటి గందరగోళం నచ్చదు.

బాధ తనది. బాదరబందీ ఇతరులది ఎందుకు కావాలి?

వంటావిడ శాంతించి, వంటింట్లోకి వెళ్ళిపోయింది.

పిల్లాడిని సోఫాలో పడుకోబెట్టి మోసెస్ వెళ్లిపోయాడు.

అప్పుడు తీశాడు-తను తెచ్చిన ఖరీదైన లాగూ, చొక్కా తొడిగాడు. ఊలు

టోపీ పెట్టి స్వెట్టరు, మేజోళ్ళు కూడా తొడిగాడు.

డైరీలో రాసుకున్న పది బెంగాలీ పేర్ల కాగితాన్ని చించి, స్వెట్టరులోకి నెట్టాడు.

పిల్లాణ్ణి చేతుల్లోకి ఎత్తుకుని గదులన్నీ తిప్పాడు. బాల్కనీ, బెడ్‌రూమ్, పూజగది–ఆగిపోయాడు.

నవ్వుతున్న కృష్ణ విగ్రహం ముందు దాదాపు పాదాల చెంత పడుకోబెట్టి మౌనంగా కూర్చున్నాడు.

రిషికి తెలుసు.

అక్కడ ఏ మహాద్భుతమూ జరిగిపోదు.

అభయం పలుకుతున్న శ్రీకృష్ణుని దివ్యహస్తంలో నుంచి ఏ దివ్య తేజస్సో ఉద్భవించి, తన బాబులో ప్రవేశించి చైతన్యవంతం చెయ్యదు. అయినా, కూర్చున్నాడు. ఎందుకో తెలియదు. మనసంతా ఖాళీ. కనీసం ఆ దేవుణ్ని ప్రార్థించటం కాకపోయినా బాధకొద్దీ నిందించనూ లేదు.

మళ్ళీ తానే లేచి పిల్లాడిని తీసుకుని కిందికి దిగి వచ్చాడు.

మరబొమ్మలా మౌనంగా స్తబ్ధుడై ఒక్కొక్క మెట్టే దిగుతున్న రిషిని, అతని చేతిలోని పిల్లవాడి శవాన్ని ఆఫీసు స్టాఫంతా చూశారు. అందరి వెనక తల దించుకుని మోసెస్ నిలబడి ఉన్నాడు.

చివరి మెట్టుమీద నిలబడి ముందుకు కదలేదు రిషి. హెడ్ క్లర్క్ సీతారామయ్య ముందుకి వచ్చి పిల్లాణ్ని అందుకున్నాడు.

"పిల్లాణ్ని కాంపౌండ్‌లోనే ఖననం చెయ్యాలి" మెల్లగా అన్నాడు రిషి.

మోసెస్ ముందు నడిచాడు.

ఆ రాత్రి–

అటు ఆస్పత్రిలో ఉన్న సుశీల పదేపదే పిల్లాడిని ఊహించుకుంటూ కళ్ళు తెరచి కలలు కంటూంది. ఇటు రిషి పక్కమీద అశాంతిగా కదులుతూ, కళ్ళు మూసుకున్నా నిద్ర రాక, కలతబారిన మనసుతో దిండు తడుపుతున్నాడు.

ఊరికి పెడగా, పచ్చని పైర్లకు సమీపంగా ఉన్న అతని బంగళా ఆవరణలోకి దూరిన నక్క తాపత్రయంగా కొత్తగా పోసిన మట్టిదిబ్బకి బొరియ చేస్తోంది.

(ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక)